# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ 14.02.2025 | 24 క్యారెట్లు 88,615.00 | కిలో వెండి 1,07,667.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:115

www.vishalabharati.com


## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన



- కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్‌జారీ
- తోటి సైనికులపై సీఆర్‌పీఎఫ్ జవాన్ కాల్పులు
- ముగ్గురు సైనికులు మృతి

2 లో

## అంబానీ సంపద రూ.7.88 లక్షల కోట్లు

- ఆసియా కుబేరులు అంబానీలే
- బ్లూంబర్గ్ నివేదికలో వెల్లడి

2 లో

## డిమాండ్ ఎంత ఉన్నా నిరంతర విద్యుత్ సరఫరా



వ్యవసాయ మోటర్లకు మీటర్ల ప్రసక్తే లేదు

వేగంగా యాదాద్రి విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2 లో



# కేసీఆర్ రీ ఎంట్రీ..!

### తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం

### పార్టీ బలోపేతంపై నేతలకు దిశానిర్దేశం

### ఫిబ్రవరి నెలాఖరున భారీ బహిరంగ సభ

### ప్రభుత్వంపై పోరాటానికి యాక్షన్ ప్లాన్

**ఫిబ్రవరి 19న ముహూర్తం**

భారత రాష్ట్ర సమితి చీఫ్ కేసీఆర్ మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్ అయ్యేందుకు రెడీ అయ్యారు. ఈ నెల 19 వ తేదీన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు కు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అధినేత ఆదేశాల మేరకు...ఈనెల 19 వ తేదీన మధ్యాహ్నం 1 గంటనుండి హైద్రాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనున్నది.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పోరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు... పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో కూడిన విస్తృతస్థాయి సమీక్షా సమావేశం జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. ఈ నెల 19 న నిర్వహించే ప్రత్యేక సమావేశంలో, బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం తదితర అంశాలపై విస్తృతస్థాయిలో చర్చించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలమీద ప్రధానంగా చర్చ జరగున్నది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణ పై సమగ్ర చర్చ జరగనుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం కార్యకర్తలు శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలు విధానాల పై ఈ విస్తృతస్థాయి సమీక్షా సమావేశంలో చర్చించనున్నారని కేటిఆర్ తెలిపారు. సమగ్ర చర్చ జరిపి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే కీలక సమావేశం కాబట్టి ఆహ్వానితులందరూ హాజరుకావాలని కేటీఆర్ సూచించారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేసీఆర్ పూర్తి స్థాయిలో ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. ఎప్పుడైనా పార్టీ నేతలు వస్తే వారితో సమావేశమై.. త్వరలోనే కార్యాచరణ అమలు చేస్తారమని.. ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిద్దామని సూచించేవారు. ఇప్పుడు సమయం వచ్చినట్లుగా తెలుస్తోంది. ఫిబ్రవరి నెలాఖరులో ఓ భారీ బహిరంగసభను నిర్వహించాలని కేసీఆర్ అనుకుంటున్నారు . ఆ తేదీని కూడా ఖరారు చేసే అవకాశం ఉంది.



## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లికి నోటీసులు

- కోడి పందాల కేసులో పోలీసుల దూకుడు
- కేటీఆర్, సంతోష్ కనుసన్నల్లో పోచంపల్లి ఫాంహౌస్ దందా..
- టీపీపీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- ఫాంహౌజ్ నాదే.. పందాలతో సంబంధం లేదు
- ఫాంహౌజ్‌ను నా మేనల్లుడు లీజుకిచ్చాడు
- పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన

..మిగతా 2 లో



## అప్పుల ఊబిలో తెలంగాణ
### పదేళ్లలో రాష్ట్రంలో జరిగిందిదే

- బడ్జెట్‌లో ఏ రాష్ట్రానికి పెద్దపీట వేయట్లేదు
- తెలంగాణపై వివక్ష చూపామనడం అబద్ధం
- పదేళ్లలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించాం
- విభజన హామీ ప్రకారం వెనుకబడ్డ జిల్లాలకు రూ.2,700 కోట్లు ఇచ్చాం
- రాజ్యసభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

..మిగతా 2 లో

## సర్కారు బడుల్లో ఏఐ ఎడ్యుకేషన్

- మొదట 500 పాఠశాలల్లో ప్రారంభం
- పాలన, ప్రజా సేవల్లోనూ ఏఐ వినియోగం
- భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే
- మైక్రోసాఫ్ట్ ఆఫీస్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్
- హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్, గూగుల్ ఏఐ సెంటర్లు
- రాష్ట్ర ప్రభుత్వంతో ఇరు కంపెనీల ఒప్పందం
- 1.2 లక్షల మందికి ఏఐలో శిక్షణ
- 15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న మైక్రోసాఫ్ట్



నగరంలో 1.1 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త మైక్రోసాఫ్ట్ క్యాంపస్ ఏర్పాటు చేయబోతున్నందుకు ఆ కంపెనీ ప్రతినిధులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్యాంపస్ ఏర్పాటు కావడం ఐటీ ఇండస్ట్రీ జర్నీలో ఇదొక అద్భుతమైన మైలురాయి అని కొనియాడారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాబోయే భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం నాడు గచ్చిబౌలిలో కొత్త మైక్రోసాఫ్ట్ క్యాంపస్ నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు మంత్రి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. మైక్రోసాఫ్ట్

..మిగతా 2 లో

## కృష్ణా నదీ జలాల విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరగనివ్వం

### తెలుగు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపు
### రాష్ట్ర హక్కులను రక్షించేందుకు కట్టుబడి ఉన్నాం
### నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ప్రజల హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, కృష్ణా జలాల విషయమై ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణకు అన్యాయం జరగనివ్వం అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల కేటాయింపు వ్యవహారంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ధాఖలు చేసిన పిటిషన్ WP1230/2023 నేడు సుప్రీంకోర్టులో విచారణకు వచ్చిన నేపథ్యంలో మంత్రి రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, న్యాయ వాదులతో కలిసి విచారణకు స్వయంగా హాజరయ్యా



రు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోర్టు విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసిందని, ఈ నెల 25వ తేదీ

..మిగతా 2 లో



## ఆర్ఆర్ఆర్ పనుల్లో వేగం పెంచాలి

### ఎలాంటి నిధుల కొరత లేదు

..మిగతా 2 లో


- ఆర్అండ్‌బీ ఆస్తులపై నివేదిక రూపొందించాలి
- హైదరాబాద్‌కు వచ్చే రహదారులన్నీ అభివృద్ధి చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

## పింక్ బుక్ రెడీ చేస్తున్నాం

- అందరి లెక్కలు రాసుకుంటున్నాం
- అంతకు అంత తిరిగి చెల్లిస్తాం
- సీఎం రేవంత్‌కు భయం పట్టుంది
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఏపీలో టీడీపీ నేత, మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్ తరహాలో.. బీఆర్ఎస్ పార్టీ పింక్ బుక్‌ను తెరపైకి తీసుకొచ్చింది. అధికారం ఉందికదా అని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమకేసులు పెడుతుందని, అన్ని పింక్‌బుక్‌లో రాసుకుంటు న్నామని.. తిరిగి అధికారంలోకి వస్తామని, వచ్చాక అన్నీ తిరిగి చెల్లిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. లెక్కలు ఎలా రాయాలో మాకు తెలుసునని.. మీ లెక్కలు తీస్తామన్నారు. జనగామలో గురువారం నాడు కవిత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని



మండిపడ్డారు. రైతు డిక్లరేషన్‌పై నిలదీస్తారని రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారన్నారు. సామాజిక మాధ్యమాల్లో చిన్న విమర్శ

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
14.02.2025
హైదరాబాద్
epaper:vishalabharathi.com
www.vishalabharathi.com



vishalabharathi Telugu Daily



# సర్కారు బడుల్లో ఏఐ ఎడ్యుకేషన్

తరువాయి భాగం

ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ మహానగరంతో మైక్రోసాఫ్ట్ సంస్థకు సుదీర్ఘ భాగస్వామ్యం ఉందని గుర్తు చేశారు. అదేవిధంగా నగరంలో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్‌తో ఇప్పటికే ఎంవోయూ కుదుర్చుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇటీవలే ఆ కంపెనీ భారత్‌కు వచ్చి 25 వసంతాలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. మైక్రోసాఫ్ట్, తెలంగాణ ప్రభుత్వం భాగస్వామ్యంతో సుమారు 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బేస్డ్ విద్యను ప్రవేశపెట్టబోతున్నామని ప్రకటించారు.

**15వేల కోట్ల పెట్టుబడులు**

ఏఐ రంగంలో కొత్తగా రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. హైదరాబాద్ ఏఐ సిటీలో ఏఐ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 1.2 లక్షల మందికి పైగా అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో శిక్షణను అందించేందుకు మూడు కొత్త కార్యక్రమాలను మైక్రోసాఫ్ట్ చేపట్టనున్నట్టు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.

విద్య, వ్యవసాయానికి గూగుల్ సహకారం

హైదరాబాద్ సిటీలో ఏఐ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు గూగుల్ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. టీహబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో గూగుల్ ప్రతినిధులు ఎంఓయూ కుదుర్చుకున్నారు. కృత్రిమ మేధ అంకుర పరిశ్రమలకు గూగుల్ తోడ్పాటునందించనుంది. విద్య, వ్యవసాయం, రవాణా రంగం, ప్రభుత్వ డిజిటల్ కార్యకలాపాలకు గూగుల్ ఏఐ కేంద్రం సహకరిస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్ లో కేంద్రం 'రాష్ట్రపతి పాలన' విధించింది. ఇందుకు సంబంధించి కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ పరిణామం జరిగిన కొద్ది రోజుల వ్యవధిలోనే అక్కడ రాష్ట్రపతి పాలన విధించడం గమనార్హం. ''మణిపూర్ గవర్నర్ సమర్పించిన నివేదికతోపాటు ఇతర నివేదికల సమాచారాన్ని పరిశీలించిన అనంతరం.. అక్కడ రాజ్యాంగబద్ధ పాలన కొనసాగించే పరిస్థితి లేదనే అంచనాకు వచ్చాం. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 అధికారాలు ఉపయోగించి మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ నిర్ణయం తీసుకున్నాం' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదేశాల్లో పేర్కొన్నట్లు కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఇదిలాఉంటే, శాసనసభ సమావేశాలకు ముందే ముఖ్యమంత్రి పదవికి బీరెన్ సింగ్ రాజీనామా చేశారు. ఆ వెంటనే సమావేశాలను రద్దు చేస్తూ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ఆదేశాలిచ్చారు. అనంతరం తదుపరి ముఖ్యమంత్రిపై రాష్ట్ర బీజేపీ నేతలు పార్టీ అధిష్ఠానంతో సంప్రదింపులు జరిపారు. సీఎం అభ్యర్థిపై రాష్ట్ర పార్టీలో ఏకాభిప్రాయం రాని నేపథ్యంలో రాష్ట్రపతి పాలన వైపే కేంద్రం మొగ్గుచూపింది.

**తోటి సైనికులపై సీఆర్‌పీఎఫ్ జవాన్ కాల్పులు**

మణిపూర్‌లో విధుల్లో ఉన్న ఓ సీఆర్‌పీఎఫ్ జవాను తోటి సైనికులపై జరిపిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 8 మంది గాయపడ్డారు. అనంతరం తనను తాను కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని లాంఫెల్‌లో ఉన్న సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ క్యాంపు సమీపంలో ఈ ఘటన జరిగినట్లు అధికారులు వెల్లడించారు. వీరిని ఇంఫాల్‌లోని రిమ్స్‌కు తరలించారు. నిందితుడు 120వ బెటాలియన్‌కు చెందిన హవల్దార్ సంజయ్ కుమార్‌గా అధికారులు గుర్తించారు.

# లోక్‌సభలో కొత్త ఐటీ బిల్లు

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

లోక్‌సభలో కొత్త ఆదాయపు పన్ను బిల్లు2025ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టారు. దశాబ్దాల కాలం నుంచి అమలులో ఉన్న పాత ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త ఆదాయపు పన్ను బిల్లు తీసుకురావాలని కేంద్రం ఎప్పటినుంచో భావిస్తోంది. ఇన్నాళ్లకు కేంద్రం కొత్త బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. విపక్షాల నిరసనల మధ్యే నిర్మలా సీతారామన్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లును లోక్‌సభ సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేయాలని స్పీకర్ ఓం బిర్లాను ఆర్థిక మంత్రి కోరారు. లోక్‌సభ సెలెక్ట్ కమిటీ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సభ్యుల వివరాలు, బిల్లు పనితీరుకు సంబంధించి మార్గదర్శకాలను పరిశీలించాలని అభ్యర్థించారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టంలో అనేక సవరణలు జరిగాయి. అలాగే, పాతపన్ను చట్టం వల్ల పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలు కూడా పెరిగాయి. ఈ కారణంగానే దీన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కొత్త ఐటీ బిల్లును సభలో ప్రవేశపెట్టడంపై వ్యతిరేకత తెలుపుతూ విపక్ష పార్టీల సభ్యులు నినాదాలు చేశారు. నినాదాల మధ్యనే బిల్లును ప్రవేశపెట్టే తీర్మానానికి సభలోని మెజారిటీ సభ్యుల నుంచి స్పీకర్ ఆమోదాన్ని పొందారు. ఆ తర్వాత విపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు.

# పింక్ బుక్ రెడీ చేస్తున్నాం

తరువాయి భాగం

చేసినా సీఎం రేవంత్ భయపడుతున్నారన్నారు. పోస్టు చేసిన మరుసటి రోజే ఇంటికి పోలీసులు వచ్చి వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.రాజ్యాంగాన్ని పట్టుకొని రాహుల్ గాంధీ తిరుగుతుంటారని... కానీ తెలంగాణలో రేవంత్‌రెడ్డి మాత్రం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారని కవిత ఫైర్ అయ్యారు. ఫేస్ బుక్ లో చిన్న పోస్ట్ పెడితే కూడా కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. తాము కూడా లెక్కలు రాసి పెట్టుకుంటామని... అందరి లెక్కలు తేలుస్తామన్నారు. కాంగ్రెస్ అంటేనే దగా.. మోసం అన్నారు. కేసీఆర్ హయాంలో గ్రామాల్లో నీళ్లు, నిధులు పారాయన్నారు. కేసీఆర్ ఉద్యమానికి భయపడి 2001లో ఆఘమేఘాలపై దేవాదుల ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాపన చేశారని. కానీ ఉమ్మడి రాష్ట్రంలో ఆ ప్రాజెక్టు ముందుకు సాగలేదన్నారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తి చేయించారని గుర్తు చేశారు. పూర్తయిన సమ్మక్క సారక్క బ్యారేజీ పనులను పూర్తి చేయలేని చేతగాని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వమని.. కేవలం 5శాతం పనులను పూర్తి చేయలేని అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మండిపడ్డారు. స్టేషన్ గణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు. అవకాశవాదం కోసం కడియం పార్టీ మారారని మండిపడ్డారు. ఆయనను ప్రజలు క్షమించే ప్రస్తకే లేదన్నారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిందని.. న్యాయవ్యవస్థపై మాకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. బీఆర్ఎస్‌కు అనుకూలమైన తీర్పు వస్తుందన్న నమ్మకం ఉందన్నారు. ఉప ఎన్నిక వస్తే అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తుందన్నారు. రూ.2500 ఇవ్వకుండా, స్కూటీలు ఇవ్వకుండా ప్రభుత్వం మహిళలను వేధిస్తోందని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్‌లు మాయమయ్యాని ఆరోపించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి మానవత్వం లేదని, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాల్సిందేనన్నారు. బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటే కుదరదని కవిత వ్యాఖ్యానించారు. ఒక బిల్లు కాదు.. మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలన్నారు. ఆడబిడ్డలను మోసం చేసిన మహమ్మారి కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు.

# అంబానీ సంపద రూ.7.88 లక్షల కోట్లు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** ఆసియా ఖండంలోనే అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్తల కుటుంబంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ కుటుంబం నిలిచింది. అంబానీ కుటుంబం 9,050 కోట్ల డాలర్ల (రూ.7.87 లక్షల కోట్లు) సంపదతో ఆసియాలో అమిత సంపన్నులైన 20 కుటుంబాల్లో అగ్రస్థానంలో నిలిచినట్టు బ్లూంబర్గ్ ప్రకటించింది. ఆసియాకు చెందిన మరెన్నో కుటుంబాలు ఆయన తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆసియా సంపన్న వ్యాపార సామ్రాజ్యాల్లో ఎనర్జీ, టెక్నాలజీ, ఫైనాన్స్ వంటి భిన్న రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థలున్నాయి. 2002లో సంస్థ వ్యవస్థాపకుడు ధీరూభాయ్ అంబానీ మరణానంతరం ముకేశ్ ఆర్ఐఎల్ పగ్గాలు చేపట్టారు. ఒకప్పుడు ఆయిల్ రిఫైనింగ్ రంగంలో కార్యకలాపాలు సాగించే సంస్థగా ఉన్న రిలయన్స్ టెక్నాలజీ, వినియోగ వస్తువులు, ఆర్థిక సర్వీసులు వంటి రంగాలకు విస్తరించడంతో పాటు ఇటీవలే హరిత ఇంధన విభాగంలోకి కూడా ప్రవేశించింది. కాగా ఈ జాబితాలో షాపూర్జీ పల్లోంజీ గ్రూప్, ఓపీ జిందాల్ గ్రూప్ ,బజాజ్ గ్రూప్, హిందూజా గ్రూప్, ఆదిత్య బిర్లా గ్రూప్ ఉన్నాయి.

# అప్పుల ఊబిలో తెలంగాణ



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ అప్పుల్లో కూరుకుపోయిన విషయం వాస్తవమని, ఎన్ని చర్యలు చేపట్టినా అప్పుల్లో కూరుకుపోతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. విభజనకు ముందు మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రం ప్రస్తుతం అప్పుల్లో మునిగిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ రాష్ట్రంపై వివక్ష చూపట్లేదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. బడ్జెట్‌లో ఏ ఒక్క రాష్ట్రానికి పెద్దపీట వేయట్లేదని తెలిపారు. బడ్జెట్‌కు ముందు అన్ని రాష్ట్రాలను సంప్రదిస్తున్నామని రాజ్యసభలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సభ్యులకు వివరణ ఇచ్చారు. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో సుదీర్ఘంగా చర్చిస్తున్నామని, పీఎం గతిశక్తి ద్వారా రాష్ట్రాల మధ్య అసమానతల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకే ప్రాధాన్యం ఇస్తున్నామనడం సరికాదన్న నిర్మలా సీతారామన్, తన ప్రసంగాన్ని అడ్డుకున్న తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలను ఉద్దేశించి లెక్కలతో సహా తెలంగాణకు నిధుల కేటాయింపులను ఈ సందర్భంగా వివరించారు. విభజన హామీల కింద తెలంగాణలో వెనుకబడిన 9 జిల్లాలకు రూ.2,700 కోట్లు ఇచ్చినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ మెదక్ నుంచి ప్రాతినిధ్యం వహించారని గుర్తుచేశారు. అయినా కూడా మెదక్ జిల్లాలో మొదటి రైల్వేస్టేషన్‌ను మోదీ సర్కారే ఇచ్చిందన్నారు.

తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను, ప్రయోజనాలను రాజ్యసభలో లెక్కలతో సహా వెల్లడించారు. రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ, నిజామాబాద్‌లో పసుపు బోర్డు, వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, మెదక్ జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ నోడల్ పాయింట్, ములుగులో సమ్మక్కసారక్క గిరిజన వర్సిటీ, బీబీనగర్‌లో ఎయిమ్స్ ఆసుపత్రి లాంటివి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 2014 నుంచి తెలంగాణలో 2,605 కిలో మీటర్ల మేర హైవేల నిర్మాణం చేపట్టామన్నారు. భారత్‌మాల కింద 4 గ్రీన్‌ఫీల్డ్ కారిడార్లు నిర్మించామని, ఈ ఏడాది తెలంగాణలో రైల్వేకు రూ.5,337 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎర్రుపాలెంనంబూరు, మల్కన్‌గిరిపాండురంగాపురం మధ్య కొత్త రైల్వేలైన్లు మంజూరుతో సహా, తెలంగాణకు ఐదు వందేభారత్ రైళ్లు ఇచ్చామన్నారు. 2014 నుంచి 753 కిలో మీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించినట్లు తెలిపారు. తెలంగాణలో అమృత్ భారత్ పథకం కింద 40 రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. పీఎం ఆవాస్ యోజన పథకంలో పట్టణాల్లో 2 లక్షల ఇళ్లు, స్వచ్ఛభారత్ కింద 31 లక్షల మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఇవే కాకుండా ప్రజలకు తాగునీరు అందించాలని జల్‌జీవన్ మిషన్ కింద 38 లక్షల నల్లా కనెక్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. 82 లక్షల మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇచ్చామని నిర్మలా సీతారామన్ తెలిపారు.

# కృష్ణా నదీ జలాల విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరగనివ్వం

తరువాయి భాగం

కల్లా అన్ని వాదనలపై షార్ట్ నోట్స్ సమర్పించాలన్నారని అన్నారు.కావున ఈ నెల 19 21వరకు జరగాల్సిన బ్రజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ యధాతథంగా ఉంటుందని ఆయన తెలిపారు. నేటి సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వం వాదనలకు మద్దతుగా నిలిచిందని, ఇది రాష్ట్ర హక్కులను రక్షించడంలో ముందడుగు అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. నేటి విచారణకు తెలంగాణ ప్రభుత్వం తరపున నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, ఆదిత్యానాథ్ దాస్ (ప్రభుత్వ సలహాదారు), వైద్యనాథన్, గోపాల్ శంకర్ నారాయణ (న్యాయవాదులు), అంతర్రాష్ట్ర నీటి వనరుల విభాగం అధికారులు, ENC (O&M) హాజరయ్యారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లికి నోటీసులు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్ శివార్లలోని ఓ ఫాంహౌజ్‌లో జరిగిన కోడి పందాల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి మెయినాబాద్ పోలీసులు గురువారం నోటీసులిచ్చారు. ఈ నోటీసులపై పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. కోడి పందాలతో తనకు సంబంధం లేదని తెలిపారు. పోలీసుల నోటీసులకు సమాధానం ఇస్తానని, విచారణకు పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. ఈ మేరకు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటన జారీ చేశారు. '2018లో మొయినాబాద్ తొల్కట్టలో కొనుగోలు చేసిన భూమి వ్యవహారాలను నా మేనల్లుడు జ్ఞాన్‌దేవ్ రెడ్డి చూసుకుంటున్నారు. అక్కడ ఫామ్ హౌస్‌లు, గెస్ట్ హౌస్‌లు లేవు. కేవలం మామిడి, కొబ్బరి తోటతో పాటు పనివారి కోసం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. తోటను వర్రా రమేష్ కుమార్ రెడ్డి అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చినట్లు కోడి పందాల ఘటన తర్వాత జ్ఞాన్‌దేవ్ రెడ్డి చెప్పాడు. వర్రా రమేష్ కుమార్ రెడ్డి కూడా ఆ తోటను ఎం.వెంకటపతి రాజుకు కౌలుకు ఇచ్చారని.. తాజాగా నా దృష్టికి వచ్చింది. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశా. మీడియాలో వస్తున్నట్లు ఆ తోటలో ఏమైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగి ఉంటే వాటికి, నాకు ఎలాంటి సంబంధం లేదు. ఘటన జరిగిన రోజు నేను హైదరాబాద్‌లో లేను. వరంగల్‌లో ఎల్లమ్మ పండుగ కార్యక్రమంలో ఉన్నా. కేవలం రాజకీయంగా నన్ను ఇబ్బంది పెట్టడానికే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క చిన్న కేసు కూడా లేకుండా ప్రజా సేవకే పరిమితమయ్యా. చట్ట వ్యతిరేక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోను. భూమి యజమానిగా ఉన్నందునే నాకు పోలీసులు నాకు నోటీసు ఇచ్చారు.. నోటీసులకు పూర్తి వివరణ ఇస్తా' అని ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కాగా,తొల్కట్ట ఫామ్‌హౌస్‌లో మంగళవారం రాత్రి పోలీసులు నిర్వహించిన దాడుల్లో కోడిపందాలు ఆడుతూ మొత్తం 61 మంది పట్టుబడ్డ విషయం తెలిసిందే. వారి వద్ద రూ.30 లక్షల నగదు, పందాలలో ఉపయోగించే రూ.కోటి విలువైన బెట్టింగ్ కాయిన్లు దొరికాయి. ఫాంహౌజ్ నుంచి 50 కార్లు, 80 పందెం కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కావాలనే తమ పార్టీ నేతలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసుల పేరుతో టార్గెట్ చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కేటీఆర్, సంతోష్ కనుసన్నల్లోనే దందా..**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఫాంహౌజ్ కోళ్ళపందాల ఘటన దుమారం రేగుతోంది. బీఆర్ఎస్ హయాంలో కేటీఆర్, సంతోష్ కనుసన్న ల్లోనే పోచంపల్లి ఫాంహౌజ్ దందా నడిచిందని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో యువతను మత్తు లో ముంచారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని క్యాసినో హబ్ గా కేటీఆర్ మార్చారని విమర్శించారు. బీఆర్ ఎస్ హయాంలో రాష్ట్రంలో రాక్షసపాలన సాగింది. కేటీఆర్ డ్రగ్స్ తో తెలంగాణను నాశనం చేశారు.. బినామీలకు క్యాసినో, కోళ్ల పందాలు అప్పగించారని అన్నారు. కేటీఆర్, సంతోష్ కుమార్ లకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి భాగస్వాములుగా ఉన్నారని చెప్పారు. బీఆర్ ఎస్ హయాంలో సన్ బర్న్ పార్టీల పేరుతో హైదరాబాద్ లో పాశ్చాత్య సంస్కృతిని తీసుకొచ్చిన చరిత్ర బీఆర్ ఎస్ నేతలదని విమర్శించారు. జన్వాడ ఫాం హౌ జ్ కేసులో డ్రగ్స్ ఇచ్చిన కేసులో పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి లిందని అనుమానాలు వ్యక్తం చేశారు.



# ఆర్ఆర్ఆర్ పనుల్లో వేగం పెంచాలి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రాంతీయ వలయ రహదారి ఆర్ఆర్ఆర్ పనుల్లో వేగం పెంచాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆర్అండ్‌బీ శాఖ ప్రీ బడ్జెట్‌కు సంబంధించిన అంశాలను అధికారులతో చర్చించారు. ఆర్ఆర్ఆర్ డీపీఆర్, 3డీ డిజైన్ వంటి పనులను వేగవంతం చేయాలని, వీటికి నిధుల కొరత లేదన్నారు. భద్రాచలం ఐటీడీఏలోని న్యాక్ కేంద్రం ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్‌బీ శాఖకు ఉన్న ఆస్తులపై నివేదిక రూపొందించి అవి అన్యాక్రాంతం కాకుండా చూడాలని.. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధాని వరకు ఉన్న రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టం నిధులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొత్త విమానాశ్రయాల నిర్మాణాలకు ఏర్పాట్లు సాగుతున్న నేపథ్యంలో ఏవియేషన్ రంగానికి తగిన నిధులు కేటాయించాలని భట్టిని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, వికాస్‌రాజ్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్, ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ఆర్థిక శాఖ కార్యదర్శి హరిత తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్ ఎంత ఉన్నా నిరంతర విద్యుత్ సరఫరా

- **వ్యవసాయ మోటర్లకు మీటర్ల ప్రసక్తే లేదు**
- **వేగంగా యాదాద్రి విద్యుత్ ప్లాంట్ నిర్మాణ పనులు**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ డిమాండ్ అత్యధికంగా ఈ నెల 10న 15,998 మెగావాట్లకు చేరినా ఎక్కడా అంతరాయం లేకుండా నిరంతర సరఫరా చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ లభ్యత 21,398 మెగావాట్ల వరకు ఉన్నందువల్ల నిరంతర సరఫరాకు ఎలాంటి ఇబ్బందులూ లేవని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ బోర్లకు మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని భట్టి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, నిరంతర సరఫరా అంశాలపై హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో గురువారం రాత్రి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మీడియాకు ఆయన వివరించారు. ''ఏటా 8 శాతం చొప్పున పెరిగితే 2030 నాటికి రోజువారీ విద్యుత్ డిమాండ్ సుమారు 24,215 మెగావాట్లకు చేరుతుంది. 2030 నుంచి 2035 వరకు ఏటా 5.6 శాతం చొప్పున డిమాండ్ పెరిగి 31,809 మెగావాట్లకు చేరుతుంది. రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ వచ్చే నిర్మాణాలతో, కొత్తగా రానున్న డేటా కేంద్రాలతో విద్యుత్ డిమాండ్ మరింత పెరుగుతుంది. హిమాచల్‌ప్రదేశ్‌లో కొత్త జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. రాజస్థాన్‌లో 3,100 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణానికి ఒప్పందం చేసుకోబోతున్నాం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత యాదాద్రి విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్నాం. రాష్ట్రంలో ఓవర్‌లోడ్ ఉన్నచోట 29 సబ్‌స్టేషన్లు నిర్మించాం. డిస్కంలకు రాయితీ కింద గత ఏడాది కాలంలో రూ.18,615 కోట్లు చెల్లించాం. రామగుండంలో కొత్తగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని నిర్ణయించాం. ఒడిశాలోని నైనీ ప్రాంతంలో కొత్తగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి నిర్మిస్తుంది'' అని భట్టివిక్రమార్క వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎండీలు కృష్ణభాస్కర్, ముషారఫ్, వరుణ్‌రెడ్డి, ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.




విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
14.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






# ఓ లింగా.. ఓ లింగా...

- రెండేళ్లకోసారి జరిగే పెద్దగట్టు
- రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతర
- ఈ నెల 16 నుంచి 20న వరకు ఘనంగా జరగనున్నా జాతర
- రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు
- ఇటీవలే రూ.5 కోట్లు విడుదల
- 10 లక్షలమందికి పైగా భక్తులు వస్తారని అంచనా
- జాతర నేపథ్యంలో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు
- 1998లోనే రాష్ట్ర ఉత్సవంగా ప్రకటన
- సంతానం లేనివారు తడిబట్టలతో ప్రదక్షిణలు.
- 200 సంవత్సరాల చరిత్ర

## గొల్ల (పెద్ద)గట్టు



### 200 సంవత్సరాల చరిత్ర

దేశంలోనే యాదవులకు పేరొందిన ఈ ఉత్సవాలను ప్రభుత్వం 1998లో రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించింది. సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ జాతరకు భక్తులు గంపనెత్తుకోని గుట్టకు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. స్వామి వారికి మేకలు, గొర్రెలు బలిస్తారు. అంగరంగ వైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో గజ్జె కట్టి ఆడుతూ, డోలు వాయిద్యాలతో పాటలు పాడుతూ లయబద్ధమైన భజనలు చేస్తు శ్రీ లింగమంతుల స్వామి వారికి పూజలు చేస్తారు. ఈ జాతరకు ప్రతీ ఏటా లక్షల్లో అదాయం వస్తోంది. ప్రతీయేటా సుమారు 15 లక్షలకు పైగా భక్తులు ఈ జాతరకు వస్తుంటారు.

**విశాలభారతి,సెంట్రల్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరగా పెద్దగట్టు పేరుగాంచింది. దీన్నే 'గొల్లగట్టు' అని కూడా అంటారు. ఈ అతిపెద్ద జాతర రెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. యాదవుల కులదైవం పెద్దగట్టు లింగమంతులస్వామి ఇక్కడ పూజలందుకుంటారు. ఈ నెల 16వ తేదీ నుంచి జాతర ప్రారంభమై ఫిబ్రవరి 20వ తేదీతో ముగియనుంది. పెద్దగట్టు జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. జాతర ఏర్పాట్ల కోసం రూ.5 కోట్లు కేటాయిస్తూ ఇటీవలే ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. పలు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టేలా కార్యాచరణను సిద్ధం చేసింది.

### పెద్దగట్టు జాతర - ముఖ్యమైన విషయాలు:

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి లింగమంతులస్వామి పెద్దగట్టు జాతర జరుగుతుంది. మేడారం సమ్మక్క సారక్క జాతర మాదిరిగానే ప్రతి రెండేళ్లకోసారి ఇక్కడ జాతరను నిర్వహిస్తారు. తెలంగాణలో మేడారం తర్వాత అతిపెద్ద రెండో జాతరగా పెద్దగట్టుకు పేరుంది.

పెద్దగట్టు జాతరనే గొల్లగట్టు జాతర అని కూడా పిలుస్తారు. యాదవుల కులదైవం పెద్దగట్టు లింగమంతులస్వామి ఇక్కడ పూజలందుకుంటారు. చౌడమ్మ దేవతలు కొలువుదీరుతారు.

జాతర ప్రారంభానికి 15 రోజుల ముందు మధుమాసం, అమావాస్య ఆదివారం రాత్రి దిష్టికుంభాలు పోయడం చేస్తారు. దిష్టి పూజ చేయడం ఆనవాయితీ. ఆ తర్వాతే జాతర పనులను ప్రారంభిస్తారు. జాతరలో తొలి అంకమైన దిష్టిపూజను ఫిబ్రవరి 2వ తేదీనే పూర్తి చేశారు. బోనంతో బలిముద్దను తయారు చేసి పరిసరాల్లో ఎలాంటి అపశకనాలు జరగకుండా సాంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారు. జాతరకు పది రోజుల ముందుగానే కేసారం గ్రామం నుంచి దేవరపెట్టెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తారు. లింగమంతులస్వామి, చౌడమ్మ దేవత, అనేక ఇతర విగ్రహాలను కలిగి ఉండే 'దేవరపెట్టె' జాతరలో కీలకమైన వేడుకగా భావిస్తారు.

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చీకటాయిపాలెం గ్రామం నుంచి ఈ దేవరపెట్టే వస్తుంది. ఆ తర్వాత కేసారం గ్రామంలోని ఓ ఇంటికి చేరుతుంది. జాతర తొలిరోజు తెల్లవారుజమున ఊరేగింపుగా ఈ దేవరపెట్టెను ఆలయానికి తీసుకవస్తారు. రెండేళ్లకోసారి జరిగే ఈ పెద్దగట్టు జాతరకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తో పాటు మరికొన్ని ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తుంటారు.

ఈసారి జరగబోయే జాతరకు పది లక్షల మందికిపైగా వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మౌలిక వసతులు,విద్యుత్ సౌకర్యం, తాగునీరు తదితర ఏర్పాట్లకు నిధులు వినియోగించనున్నారు. దురాజుపల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతర నేపథ్యంలో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి పై ట్రాఫిక్ ఆంక్షలు కూడా అమలులో ఉంటాయి.

ఆదివారం ప్రారంభమైన ఈ జాతర ఐదు రోజుల పాటు జరుగుతుంది. అందనపు చౌడమ్మ తల్లి దేవరపెట్టెలో ఉంటుంది. ఉత్సవాల్లో ఊరేగిస్తుండగా దేవర కోసం ఎదురు చూస్తున్న భక్తులు ఓ లింగా.. ఓ లింగా అని స్మరిస్తూ దేవరపెట్టెను తాకుతారు. ఇలా తాకడం వల్ల పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. చౌడమ్మను ,సౌడమ్మతల్లిగా, చండీమాతగా కూడా పిలుస్తారు . యాదవుల కులదేవత సౌడమ్మ ఆలయాలు సూర్యాపేట జిల్లాలో ఎక్కువ కనిపిస్తాయి. జాతరలో భాగంగా పొట్టేలును తీసుకొచ్చి దానికి పూలదండ వేసి పసుపు, కుంకుమ పెట్టి దేవుడు ఉన్న దిక్కువైపు వదిలేస్తారు. గొర్రె జల్తి ఇవ్వగానే మొక్కు తీర్చుకుంటారు.



### సంతానం లేనివారు తడిబట్టలతో ప్రదక్షిణలు.

**సంతానంలేని మహిళలు బోనం కుండ ఎత్తుకుంటారు. పిల్లలు లేనివారు స్నానం చేసి తడిబట్టలతో గుడిచుట్టూ ప్రదక్షిణలు చేస్తే స్వామి అనుగ్రహంతో సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీనిని పానసారం పట్టడం అంటారు.**

లింగమంతు స్వామి శాఖాహారి కావడంతో ఆయనకు నైవేద్యం సమర్పిస్తారు. మిగితా దేవతలకు జంతుబలులు ఇస్తారు. జాతరకు ఒకరోజు ముందు భక్తులు చేరుకుంటారు. పురుషులు ఎరుపురంగు వస్త్రాలు ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టుకొని డిల్లెం బల్లెం శబ్దాల నడుమ నడుస్తూ ఓలింగా.. ఓ లింగా అంటూ హోరెత్తిస్తారు.

### స్థల పురాణం ప్రకారం

రాష్ట్రకూట వంశానికి చెందిన ధ్రువుడు తన పేరిట ఇక్కడ గ్రామాన్ని నిర్మించాడనీ, అదే కాలక్రమంలో దురాజ్‌పల్లిగా మారిందని అంటారు. కాకతీయుల కాలంలో ఉండ్రు కొండపై శివకేశవులు ఆలయాలు ఉండేవి. ఇక్కడ ఏటా అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించేవారు. ఈ ఉత్సవాల్లో మొక్కులు చెల్లించేందుకు గుట్టకు వచ్చిన ఓ గర్భిణి పైకి ఎక్కుతుండగా జారిపడి మరణించిందని, ఈ ఘటనకు చలించిపోయిన స్వామివారు భక్తులకు వీలుగా ఉండేట్లు పాలసేర్లయ్య గుట్టపై లింగమంతుల స్వామిగా వెలిశారని స్థానికులు చెబుతారు.

పూర్వం హిందువుల శివుని గుడులను నిధుల కోసం పిండారీలు ధ్వంసం చేసి దోపిడీ చేసేవారు. వీరి నుంచి భారీ విగ్రహాలు చోరీ కాకుండా అప్పటి యాదవులు లింగమంతుల, పాలచర్లయ, చౌడమ్మ తల్లి, ఎలమంచమ్మ, ఆకు మంచమ్మ, గంగ దేవుళ్ల విగ్రహాలను ఒక పాత బావిలో దాచి పెట్టారు. దీంతో వల్లాపురం గుట్ట ప్రాంతమంతా చెల్లాచెదురైందని, ప్రజలు కూడా కరువు కాటకాలతో ఆగమైనట్లు పూర్వీకులు పేర్కొంటున్నారు. కాలక్రమేనా విగ్రహాలు దాచిపెట్టిన భావి కూరుకుపోయింది. ఇదే ప్రాంతంలోని కేసారం గ్రామం మెంతబోయిన వంశానికి చెందిన ఒకరు, మున్న వంశానికి చెందిన ఒకరు, గొర్ల వంశానికి చెందిన మరొకరు కలిసి ఆవులు, గొర్లను మేపుకుంటూ కాలం వెళ్లదీసేవారు. ఒకరోజు ఆవులు మేపే క్రమంలో ఊరి బయట విగ్రహాలు దాచిన పాత బావి పక్కన ఉన్న మర్రిచెట్టు కింద సేద తీరారు. వీరిలో ఒకరికి కలలో లింగవంతులస్వామి ప్రత్యక్షమై "నేను ఈ పాత బావిలో ఉన్నాను. నన్ను బయటకి తీసి గుడి కట్టించండి. మీకు మేలు జరుగుతుంది" అని చెప్పినట్లు నానుడి. ఇదే విషయాన్ని స్థానికులకు తెలుపగా సంబంధిత పూజారులు చీకటాయపాలెం గ్రామానికి చెందిన తండా వంశస్థులని తెలుసుకున్నారు. వెంటనే వీరిని పిలిపించి వడ్డెరుల తవ్వకాలతో బావిలోని విగ్రహాలు బయటకు తీయించారు. ఈ క్రమంలోనే ఓ విగ్రహానికి గుణపం తగిలి విగ్రహం నుంచి పాలు కారినట్టు పూర్వీకులు చెప్తుంటారు. దీంతో పాలచర్లయ్య అని పేరుపెట్టారు. ఇలా బయటికి తీసిన మూలవిరాట్ విగ్రహాలను దురాశపల్లి గుట్టమీద ఏర్పాటు చేశారు. తండా, మట్ట వంశస్థులు కలిసి అక్కడే కట్టారు. మెంతేపోయిన వంశస్థులు , మున్న వంశస్థులు కలిసి సౌనేశ్వరమ్మ (సౌనమ్మ తల్లి) గుడి కట్టారని పూర్వీకులు తెలపడం విశేషం

- మున్న వెంకటేష్







విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
14.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# ఎస్పీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు

**కొత్తగూడెం, విశాలభారతి:**

భద్రాద్రి జిల్లా పోలీసులు ఎదుట 19 మంది మావోయిస్టు సభ్యులు గురువారం లొంగిపోయారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు భద్రాచలం ఏ ఎస్ పి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరించారు.జిల్లా పోలీసులు సిఆర్పిఎఫ్ బెటాలియన్లు 81,141, ఆదివాసి గిరిజనుల కోసం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమం తదితర కార్యక్రమాలకుఆకర్షితులై జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకొని 19 మంది లొంగిపోయినట్టు ఎస్పీ వెల్లడించారు.చత్తీస్గఢ్ కాంకేర్ జిల్లా చెందిన నరోటి మనీష్,బీజాపూర్ జిల్లాకు చెందిన మడవి నంద,మడవి హడమ,పోడియం సమ్మయ్య, పోడియం నగేష్,పోడియం అడుమా,సోడి హరిజన్,మడకం ఉంగ,కుంజం మాస,మీరుగం సుక్కయ్య,మడవి ఇడుమయ్య, సల్వం వెంకట్,సెల్వం శంకర్, సుఖమా జిల్లాకు చెందిన మడవి కొస,శూల,సోడి ఇడుమా, మడకం దేవి,కలుమ అయిత, దంతే వాడకు చెందిన మడవి హండా లు పోలీసుల ఎదుట లొంగిపోయారు. జనవరి లో జిల్లా పోలీసులు చర్ల లో లొంగిపోయిన మావోయిస్టు కుటుంబ సభ్యులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం లో లొంగుబాటు వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుని, ప్రభుత్వం అందించే పథకాల వల్ల లబ్ది పొందాలని నిర్ణయించుకుని వీరు లొంగిపోయినట్లు ఎస్పీ వెల్లడించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్,ఏ ఎస్పీ విం్రకాంత్ కుమార్ సింగ్, ప్రీత్, 141బేటాలియన్ సెకండ్ ఇన్ కామండెంట్, రాజేష్ ధోగ్ర 81బేటాలియన్ డిప్యూటీ కమాండెంట్, మణుగూరు డి ఎస్పీ రవీందర్ రెడ్డి, దుమ్ముగూడెం సీఐ అశోక్, చర్ల సీఐ రాజువర్మ, అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.


## జడ్జిపై దాడి ఘటనను ఖండించిన

# సీనియర్ అడ్వకేట్ హరికృష్ణ

**ఎల్బీనగర్ ,విశాలభారతి:**



రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం కోర్టులో న్యాయమూర్తి పై దాడి ఘటనను అడ్వకేట్ హరికృష్ణ తీవ్రంగా ఖండించారు. ఓ కేసులో కరణ్ సింగ్ అనే వ్యక్తికి రంగారెడ్డి కోర్టులో IX ఎడిజే కోర్టు న్యాయమూర్తి హరీష మహిళా జడ్జ్ అతనికి జీవిత ఖైదు శిక్ష విధించడం జరిగింది.ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని నిందితుడు కరణ్ సింగ్ జడ్జి పై చెప్పు విసరడం చాలా దారుణమైన సంఘటన ఈ విషయాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.ఈ దేశంలో న్యాయమూర్తులకు న్యాయవాదులకు సరైన రక్షణ లేకుండా పోయింది. న్యాయం చేయడం కోసం న్యాయమూర్తులు ఉంటారు వారిపై ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరం. న్యాయమూర్తులకు న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కక్షిదారుల నుంచి నేరస్తుల నుంచి రక్షణ కల్పించాలని మేము ప్రధానంగా డిమాండ్ చేస్తున్నాం నిందితున్ని తీవ్రంగా శిక్షించాలని కోరారు. అడ్వకేట్ హరికృష్ణ మాట్లాడుతూ నేటికీ ఈ సమాజంలో నేరాలు వాటి గల శిక్షలు గురించి ప్రజల్లో ఎలాంటి అవగాహన లేదని అందుకే చాలా దారుణాలు జరుగుతున్నాయని తెలిపారు.



వెబ్సైట్ ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు పక్కన ఎమ్మెల్యే గాంధీ.

# కెరియర్ కన్సల్ట్స్ వెబ్సైట్ ప్రారంభం

- పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 36 లో కెరియర్ కన్సల్ట్స్ వెబ్ సైట్ ను గురువారం ఐటీ,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.




ప్రతిభావంతులకు అవార్డులను ప్రధానం చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

# హైటెక్స్‌లో బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్

- పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

మాదాపూర్ డివిజన్ పరిధిలోని హైటెక్స్ హెచ్ఐసీసీ లో జరిగిన హైబిజ్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో ఐటీ పరిశ్రమలు,వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో ప్రధానం చేసిన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కలిసి పాల్గొని అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను మంత్రి అభినందించారు.

## చిలుకూరు బాలాజీ ఆలయ పూజారిని పరామర్శ

**ఆర్మూర్, విశాలభారతి;**

చిలుకూరు ఆలయ పూజారి రంగరాజన్ పై ఇటీవల దాడి జరగడంతో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గురువారం రంగరాజన్ ను పరామర్శించారు. పూజారి పై దాడి చేయడం బాధాకరం అని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్య తీసుకోవాలని కోరారు. ఇటువంటి ఘటనలకు బిజెపి వ్యతిరేకమని ఎమ్మెల్యే అన్నారు.



# విప్లవ విద్యార్థి ఉద్యమంలో చారిత్రక సందర్భం

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) ఉస్మానియా యూనివర్సిటీ లో పురుడోసుకొని నేడు దేశవ్యాప్తంగా విద్యార్థుల పక్షాన పోరాడుతోంది. అనేకమంది విప్లవ విద్యార్థుల ప్రాణ త్యాగాలు, 50 సంవత్సరాల సుదీర్ఘ పోరాట వారసత్వం పీ డీ ఎస్ యూ సొంతం, రాజ్యం, పాలక ప్రభుత్వాలు ఎంతటి నిర్బంధం ప్రయోగించినా ఎప్పటి కప్పుడు వాటికి సవాలు విసురుతూ తన ప్రత్యేకతను చాటుకుంటూనే ఉంది. నిన్నటి వరకు విడివిడిగా కొనసాగిన రెండు పీడీఎస్ యూ సంస్థలు నేడు ఐక్యమవడం చారిత్రక సందర్భం.

శాస్త్రయా విద్యా విధానం సమసమాజ స్థాపన, నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన కోసం ఉన్నతమైన ఆశయాలకోసం 1974 అక్టోబరు 12న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రగా ఏర్పడిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విదార్ధి సంఘం (పి.డి.ఎస్.యు), తన 50 ఏళ్ళ అర్ధ శతాభోత్సవాలను ఘనంగా జరుపుకుంది. ఈ 50 ఏళ్ళ విప్లవ విద్యార్థి ఉద్యమంలో జార్జిరెడ్డి త్యాగం, జంపాల చంద్రశేఖర ప్రసాద్ అమరత్వం, శ్రీపాద శ్రీహరి పోరాట పటిమ, కోలాశంకర్ ధైర్య సాహసాలు, చేరాలు, రంగవల్లి, స్నేహలత, సుసేన, రమణయ్య, మారోజు వీరన్న, యానాల వీరారెడ్డి, చాంద్పాషా, వరహాలు లాంటి ఎందరెందరో వీరుల అంకితభావం అశేషమైన పీడిత విద్యార్థి లోకాన్ని నేటికీ కదిలిస్తూనే ఉంది. వీరి ఆశయ సాధనలో నిన్నటి వరకు విడివిడిగా కొనసాగిన రెండు PDSU సంస్థలు నేడు ఐక్యమవ్వడాన్ని అనేకమంది ప్రగతిశీల విద్యార్థి అభిమానులు, విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు హర్షిస్తున్నారు. ఈ కలయిక పటిష్టమైన విప్లవ విద్యార్థి ఉద్యమానికి తోడ్పాటునందిస్తుందని ప్రకటిస్తున్నాము. దేశ విప్లవ విద్యార్థి ఉద్యమంలో ఇదొక చారిత్రాత్మక పరిణామం.

బీజేపీ నకిలీ దేశభక్తి, కుహనా జాతీయత మాటున కార్పొరేట్లకు అనుకూలమైన చట్టాలను చేస్తూ, దేశాన్ని నిలువునా అమ్ముతున్న స్థితి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో జాతీయ, అంతర్జాతీయ, స్థానిక పరిస్థితులు నేడు ఉద్యమాల ఆవశ్యకతను తెలియజేస్తున్నాయి. ప్రగతిశీల విద్యార్థుల ఐక్యత నేడు అనివార్యంగా ముందుకొచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో రెండు విప్లవ విద్యార్థి సంఘాలు ఐక్యమవుతున్నాయి. ఇది ఈ రెండు సంస్థల ఐక్యత వరకే పరిమితం కాకుండా, దేశంలో ఉన్న మరిన్ని విప్లవ విద్యార్థి సంఘాలతో భవిష్యత్తులో ఐక్య మవ్వడానికి ప్రయత్నిస్తున్నది. దీని ద్వారా మరింత బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తుంది. సమరశీల పోరాటాలను సాగిస్తుంది. ఈ ఐక్యత సమసమాజాన్ని సాధించడం కోసం తోడ్పడుతుంది.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరనుండి కార్పోరేట్ ప్రయోజనాలే తప్ప, సామాన్య ప్రజలకు ఒరిగిందిలేదు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా వ్యవస్థను ప్రైవేటీకరణ కాషాయకరణ చేస్తూ దేశ విద్యారంగానికి పెను ప్రమాదంగా మారుతా ఉన్నది.

తాజాగా ఆర్థిక శాఖామంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 50,65,345 కోట్ల బడ్జెట్లో కార్పోరేట్లకు, పెట్టుబడీదార్లకు భారీ ఊరట లభించింది. విద్యారంగానికి 10శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే కానీ మూడు శాతానికి మించడం లేదు. ఈ బడ్జెట్లో నిరుద్యోగానికి రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకాలకు కూడా బడ్జెట్లో నిధులు కేటాయించలేదు.

ఆంధ్రరాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు అంటూనే గత పాలకులు అవలంభించిన విధానాలనే అమలు చేస్తున్నారు. రాష్ట్రలో 50,450 టీచర్ పోస్టులో ఖాళీగా ఉంటే కేవలం 16347 పోస్టుల తోటి మెగా డియస్సీ ద్వారా భర్తీ అనడం హాస్యాస్పదం అవుతుంది. తల్లికి వందనం క్రింద ప్రతి విద్యార్థికి 15000 రూపాయలు ఇస్తానన్న హామీని నెరవేర్చలేదు. పి.జి. విద్యార్థులకు ప్రవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదువు విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ రద్దు చేసే జి.ఓ.నెం.77ను రద్దు చేయలేదు. మెడికల్ సీట్లు అమ్ముకునేందుకు ప్రభుత్వం తీసుకు వచ్చిన 107, 108 జి.ఓ.లను రద్దు చేయలేదు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినిపించలేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచడంలో విఫలం చెందారు. పెండింగ్లో ఉన్న 3500 కోట్ల రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయలేదు.

మిత్రులారా! అందరికీ సమానమైన విద్య, ఉద్యోగాల కల్పన, ప్రభుత్వ విద్యా సంస్థల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాన్ని సంఘటిత పరచేందుకు, ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు బలమైన విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణంకోసం జరుగుతున్న పి.డి.ఎస్.యు. సంస్థల విలీన సభ ఈ నెల 14న నెల్లూరు నగరంలో జరుగబోతుంది. ఈ సభకు విద్యార్థులు, మేధావులు, హాజరై జయప్రదం చేయాలని కోరుతున్నాం.




కె.భాస్కర్
PDSU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.
ఆంధ్ర ప్రదేశ్



స్మశాన వాటికలను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ హమీద్ పటేల్

# షాబే ఈ బారాత్‌లో భాగంగా స్మశాన వాటికలను క్లిన్

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

షాబే ఈ బారాత్ పండుగ పర్వదినం సందర్బంగా కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ ఏ బ్లాకు, మార్తాండ్ నగర్, అంజయ్య నగర్, న్యూ పీజేఆర్ నగర్ లోని ముస్లిం స్మశాన వాటికలను శుభ్రం చేశారు. గురువారం జీహెచ్ఎంసీ సిబ్బందిచే కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ పొదలు,ముళ్ళ కంపలు, ఎండిపోయిన పిచ్చి మొక్కలు,చెట్లు,పాస్టిక్ వ్యర్థాలను జేసీబీతో తొలగించారు.శానిటేషన్ సిబ్బంది సహాయంతో, స్థానిక నాయకులతో కలసి స్మశాన వాటికలను క్లిన్ చేశారు.ఈ సందర్బంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సంవత్సరానికి ఒకసారి దేవుని వద్దకు చేరిన పెద్దలను తలుచుకుంటూ వారి కోసం ఉపవాస దీక్షలు చేయటం,వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాటం కోసం ఒకరాత్రి మొత్తం ప్రత్యేక ప్రార్ధనలు చేయటం జరుగుతుందని అన్నారు. వారిని ఎక్కడ పెట్టామో అక్కడ ఉన్న స్మశాన వాటికకు వెళ్లి వారి సమాధులపై పూలు చల్లి, వారి ఆశీస్సులు తీసుకోని, ప్రత్యేకంగా వారిని స్మరించుకోవటం ఈ షాబే ఈ బారాత్ పండుగ యొక్క ప్రత్యేకత అని కార్పొరేటర్ హమీద్ పటేల్ అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇమామ్, సయ్యద్ ఉస్మాన్, షేక్ జాఫర్, సయ్యద్ హర్షద్, అబ్దుల్ వసీం, సంజు, సంతోష్, సల్మాన్, జహీర్ మూల సాబ్, పాషా భాయ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పెద్ద అంబర్ పేట్,విశాలభారతి:**

హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో IPWS కాలనీ, నాగారంకి చెందిన సత్తిపాటి శివాజీ తండ్రి రమేష్, వయసు 26 సంవత్సరాలు, వృత్తి బట్టల వ్యాపారం చేసుకుంటూ జీవించే వాడు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో స్కూటీ పై హయత్ నగర్ నుండి అబ్దుల్లాపూర్ మెట్టుకు వెళ్ళుచుండగా A1బేకరీ ఎదురుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద ప్రయాణిస్తున్న స్కూటీ అదుపు తప్పి ప్రమాదవశాత్తు స్కిడ్ అయ్యి రోడ్డు మీద పడగా శివాజీ తలకు మరియు కాళ్లు,చేతులకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు గమనించి 108 అంబులెన్స్ సహాయంతో వనస్థలిపురం నందు గల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, అక్కడ శివాజీని పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు.శివాజి చెల్లి సత్తిపాటి పూజ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఇన్స్పెక్టర్ సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు.



# అధికారం అండగా ఇసుక దందా

- సైదాపూర్ లో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా.
- మాఫియాకు నాయకుల అండదండలు.
- కలెక్టర్ ఆదేశాలు సైతం బే ఖాతర్.



**సైదాపూర్ విశాలభారతి:**

సైదాపూర్ మండల పరిసర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అక్రమార్కులకు ఇసుక దందా కాసుల పంట పండిస్తోంది. కొందరు వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా వాగులు, వంకల్లో ఇసుక తవ్వుతున్నారు. ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వారికి ఖద్దరు అండదండలు ఉండడంతో వారి ఆగడాలకు అంతు లేకుండా పోతుంది. కలెక్టర్ ఆదేశాలు సైతం లెక్కలేకుండా పోతున్నాయి.

**అడుగంటుతున్న భూగర్భ జలాలు :**

గ్రామాల్లోని వాగుల నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. దీంతో భూగర్భజలాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. బావులు, బోర్లు ఎండిపోయి పంటలకు సాగునీటి కొరత సమస్య ఏర్పడుతోంది.

**అక్రమార్కులకు వరం :**

మండల కేంద్రమైన సైదాపూర్ తో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో అభివృద్ధి పనులు, భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. జేసీబీలతో వాగుల్లో ఇసుకను తోడి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అక్రమార్కులు ట్రాక్టర్ ఇసుకను గ్రామాల్లో రూ.3వేలు, ఇతర ప్రాంతాల్లో రూ.5 వేలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.

**వాగులు గుల్ల**

ఇసుక మాఫియా ధన దాహానికి వాగులు గుల్లగా మారుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుకను తరలిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. ఇసుక మాఫియా వైఖరి కారణంగా వాగుల నుంచి పెద్ద మొత్తంలో ఇసుక తరలిపోతుండగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.పోలీసులు, రెవెన్యూ అధికారులు తాము పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు లొంగి వొదిలిపెడుతున్నారనే విమర్శలున్నాయి.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
14.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




# రంగారెడ్డి జిల్లా కోర్టు మహిళా జడ్జిపైకి చెప్పు విసిరిన నిందితుడు

- రంగారెడ్డి జిల్లా కోర్టులో కలకలం
- నేడు విధులు బహిష్కరిస్తున్నట్టు జిల్లా బార్ అసోసియేషన్ ప్రకటన.

**ఎల్బీనగర్,విశాలభారతి:**

ఎల్బీనగర్లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో గురువారం కలకలం రేగింది. కోర్టు హాలులో కేసు విచారణలో మహిళా జడ్జి నిందితుడు చెప్పు విసరడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. అత్తాపూర్ సిక్ విలేజ్కు చెందిన కరణ్ సింగ్ అలియాస్ సర్దార్ చీమ కొర్తి (22) పలు నేరాలలో నేరస్తుడు కాగా కొన్నేళ్లుగా చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అయితే కేసు విచారణలో భాగంగా ఈనెల 12న రంగారెడ్డి జిల్లా 9వ అడిషనల్ సెషన్స్ జడ్జి హరిష నిందితుడికి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ క్రమంలో నిందితుడిని గురువారం పోలీసులు కోర్టులో హాజరు పరచగా కరణ్ సింగ్ జైలులో తనకు ఎదురవుతున్న ఇబ్బందులపై జడ్జికి వివరించే ప్రయత్నంలో ఒక్కసారిగా తన కాలికి ఉన్న చెప్పును తీసి మహిళా జడ్జిపై విసిరాడు. ఈ పరిణామంతో జడ్జి సహా అందరూ షాక్ కు గురికాగా పోలీసులు వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని పక్కకు తీసుకెళ్లారు. కాగా జడ్జిపై జరిగిన దాడిని జిల్లా బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. దాడికి నిరసనగా శుక్రవారం అన్ని కోర్టులలో విధులు బహిష్కరిస్తున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ తెలిపారు.

## పిషా రిస్ కార్పొరేషన్ చైర్మన్ కు సన్మానం



**ఆర్మూర్,విశాలభారతి:**

ఆర్మూర్ పట్టణంలోని జి జి ఫౌండేషన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆత్మీయ స్వాగతం పలికి, ఘనంగా సన్మానం చేశారు. ఇట్టి కార్యక్రమంలో జి జి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన గుజరాతి, రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆదర్శ మాజీ అధ్యక్షులు డీజే దయానంద్, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు నారాయణ్ వర్మ డీజే. కాశినాత్,డీజే. సునీల్,కాంగ్రెస్ బీసీ అధ్యక్షులు బోచకర్ వెను, భింగి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్మాతలు

- సిస్టర్ ఆఫ్ సెయింట్ ఆన్స్ గుంటూరు ప్రొవైన్షియల్ శౌరీలమ్మ

**కోదాడ, విశాలభారతి:**



సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్మాతలు అని సిస్టర్ ఆఫ్ సెయింట్ ఆన్స్ గుంటూరు ప్రొవైన్షియల్ శౌరిలమ్మ అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ సిసిఆర్ విద్యాలయంలో ఉపాధ్యాయురాలుగా పనిచేసి పదవి విరమణ పొందిన ఏరువా స్లివా సిస్టర్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ ఆన్ జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయురాలిగా విద్య అంతంత మాత్రంగానే ఉన్న ఆరోజుల్లో ఉన్నత చదువులు చదివి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు విద్యా పురోగతికి సిస్టర్ ఏరువా స్లివా ఎంతగానో కృషి చేశారని వారి సేవలను కొనియాడారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా సమాజానికి అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. అనంతరం శాలువా పూల బొకేలతో సిస్టర్ స్లివా ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, సిస్టర్ స్లీవా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం

**తొర్రూరు,విశాలభారతి:**

వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ శాసనమండలి బీజేపీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డి గారి గెలుపు కోరుతూ తొర్రూరు పట్టణంలో స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ ఆద్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈసమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొలుపుల శంకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎమ్మెల్సీ ఎన్నికల మండల కన్వీనర్ పల్లె కుమార్ సంయుక్తంగా మాట్లాడుతూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన 6 హామీలు మోసం చేసినట్టుగా ఉపాధ్యాయ, అధ్యాపక వర్గాలను మోసం చేస్తున్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఉపాధ్యాయులకు 5 డిఎలు అమలు చేస్తామంటూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని, పిఆర్సి ఇస్తాం అని చెప్పారు 19 నెలలు అయినా దాని ఉలుకు పలకులేదని, కాంగ్రెస్ అధికారంలో కి వస్తే 6 నెలలో సిపిఎస్ రద్దు చేస్తాం అని అన్నారు. సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు జలగం రవి, దేవరకొండ విష్ణు, బీజేవైఎం జిల్లా కాలేజీ అవుట్ రీచ్ కన్వీనర్ నూకల నవీన్, బీజేవైఎం అర్బన్ అధ్యక్షుడు శీలం శ్రీనాథ్ సోషల్ మీడియా కన్వీనర్ కుమ్మరికుంట్ల శివ, మండల ఉపాధ్యక్షుడు గంధం రాజు, మండల నాయకులు పప్పు శెట్టి సంతోష్, కాసోజు శ్రీనివాస్ చారి, కక్కెర్ల సురేష్,బి. రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## మూర్ఛ వ్యాధిపై అవగాహన సదస్సు

**తొర్రూరు, విశాలభారతి:**

టిచర్స్ లయన్స్ క్లబ్ తొర్రూర్ వారి ఆధ్వర్యంలో ఏపిలెప్సి ( మూర్ఛ వ్యాధి) లయన్ స్టిక్ ఇయర్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్ సందర్భంగా దాట్ల ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు టీచర్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమంలో వెలిదె సురేష్ కుమార్ మాట్లాడుతూ స్థానిక పిహెచ్సి వైద్యులు డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ప్రపంచ ఏపీలేప్సి (మూర్ఛ వ్యాధి) దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మూర్ఛ వ్యాధి సమస్యలు దాని నివారణ మార్గంపై విద్యార్థులకు వివరించడం జరిగింది. మూర్ఛ వ్యాధి వచ్చినప్పుడు పిల్లలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, వ్యాధిపట్ల అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో టీచర్స్ క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ మాట్లాడుతూ ఏపీలేప్సి దినోత్సవం సందర్భంగా టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాట్ల పాఠశాల విద్యార్థులకు మూర్ఛ వ్యాధిపై, మరియు వివిధ ఆరోగ్య సమస్యలపై వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీచర్స్ క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్, ప్రధాన కార్యదర్శి వెళిదే సురేష్ కుమార్, స్థానిక వైద్య సిబ్బంది కమల,మణెమ్మ, కవిత,కృపమ్మ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాణ స్వీకారానికి భారీ ర్యాలీతో బయలుదేరిన చీకటి కార్తీక్

- అభినందనలు తెలిపి ఆశీస్సులు అందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**కొత్తగూడెం, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా గెలిచిన చీకటి కార్తీక్ నేడు హైదరాబాద్ గాంధీభవన్ లో ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా పాల్వంచ కేశవాపురం పెద్దమ్మతల్లి గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులు అందుకుని దాదాపు 150 కార్లతో భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్ళారు. ప్రమాణ స్వీకారోత్సవానికి భారీ ర్యాలీతో బయలుదేరిన చీకటి కార్తీక్ బృందానికి మంత్రి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలి

**అశ్వాపురం, విశాలభారతి :**

అడవుల్లో వేసవి కాలంలో జరిగే అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని మణుగూరు ఎఫ్ డి ఓ సయ్యద్ మక్సూద్ మోహినుద్దీన్ అన్నారు. గురువారం అశ్వాపురం రేంజ్ పరిధిలోని ఎలకలగూడెం, కొత్తూరు గ్రామాలలో అడవులలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలు, వన్యప్రాణి సంరక్షణ గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అటవీ చుట్టు పక్కల గ్రామాలలో అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని, ఒకవేళ జరిగితే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని అటవీ సంరక్షణలో అందరమూ భాగస్వాములు అవ్వాలని కోరారు. అనంతరం బండ్ల వారి గుంపు గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న ఫారెస్ట్ స్టేషన్ ను సందర్శించారు. ఈ కార్యకమంలో అశ్వాపురం రేంజ్ ఆఫీసర్ రమేష్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్స్ ధనలక్ష్మి, వెంకట్రావు, బీట్ ఆఫీసర్లు బాబురావు, వాణి, సునీల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులకు ఆశీర్వదించిన పెద్ది కృష్ణమూర్తి గౌడ్

**దేవరుప్పల, విశాలభారతి:**

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కారుపోతుల శ్రీనివాస్భాగ్యలక్ష్మి దంపతుల కుమార్తె శృతిసాయిల వివాహం జనగామ జిల్లా కేంద్రంలోని ఎన్ఎంఆర్ గార్డెన్ లో జరుగగా ఆ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరుప్పుల పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్. వారి వెంట నియోజకవర్గం యాత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుకూరి నర్సయ్య,కారుపోతుల మహేందర్, కారుపోతుల యాకస్వామి,కారుపోతుల నరేష్,ఆకుల సంతోష్, కారుపోతుల మహేష్ తదితరులున్నారు.



## జిగరి రాములు భౌతిక దేహాన్ని సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**దేవరుప్పల, విశాలభారతి:**

పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో బంజర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జిగరి రాములు మరణించగా ఈ రోజు వారి ఇంటికి వెళ్ళి వారి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు దేవర వీరస్వామి, గ్రామ నాయకులు బానోత్ రామచంద్రు, ఎస్టీ సెల్ యూత్ అధ్యక్షుడు గుగులోత్ నరేందర్, మేండగుజ్జుల రమేష్, కౌడ ఉప్పలయ్య,జీగారి మల్లయ్య, బిసి, ఎస్ సి సెల్ మండల అధ్యక్షులు కాడబోయిన గణేష్,ఇనుముల నాగరాజు,బోనగిరి యాకస్వామి,రెడ్డిరాజుల. రమేష్,మాజీ ఎంపీటీసీ ఎండి. జాకీర్,కాడబోయిన వెంకన్న,దౌపాటి నరసింహ,ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్,తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

- డాక్టర్ దుర్గాభవాని

**పినపాక, విశాలభారతి:**



గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు దుర్గా భవాని కోరారు. గురువారం పినపాక మండల పరిధిలో గల తోగూడెం ప్రాథమిక పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నిక్షేయ్ శివిర్ వందరోజుల ప్రణాళికలో భాగంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో చెస్ట్ పరీక్షలు, ఎక్సరే, తెమడ పరీక్షలు నిర్వహించినట్లు గా తెలిపారు. క్షయ వ్యాధి లక్షణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, ఎంఎల్ హెచ్ పి ఎస్, హెచ్ ఇ ఓ, వెంకటేశ్వర్లు, ప్రేమ్ కుమార్, లహరి, ఆశాలు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు బాప్టిస్ట్ చర్చ్ సిల్వర్ జూబ్లీ

**పాలకీడు విశాలభారతి:**



మండల కేంద్రంలోని మహంకాళి గూడెంలో తెలుగు బాప్టిస్ట్ చర్చ్ యొక్క సిల్వర్ జూబ్లీ ఘనంగా జరగడం జరిగింది. చర్చ్ పండుగ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కులామతాలకు అతితంగా పండుగ లో పాల్గొనడం జరిగింది. చర్చి ప్రతిష్టదినోత్సవం సందర్భంగా స్థానిక పాస్టర్ డా దేవపంగు సుధాకర్, పాస్టర్ అమ్మ కి శాలువాలతో, పూలదండలతో సన్మానం చేశారు. అదేవిదంగా ఇట్టి పండుగ లో పాలకీడు మండలం తహసీల్దార్ కమలాకర్ పాస్టర్ సుధాకర్ దేవుని సేవలో 25 సంవత్సరములు పూర్తి అయిన సందర్భంగా, ఫిబ్రవరి 3వ తారీఖున కందుకూరు లో డాక్టరేట్ ప్రదానంచేసినందుకు గాను, సన్మాన కార్యమంలో సంఘం వారితో కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సంఘ కాపరి కిరణ్ పాస్టర్,సంఘం పెద్దలు కారపాటి మరియాదాసు, కారపాటి దేవయ్య, పిడమర్తి ప్రేమాకుమార్, రాజు, దావీదు, మీసాల కరుణాకర్, కత్తి దానయ్య, ఇంకా చర్చ్ పెద్దలు, సంఘం వారు పాల్గొన్నారు.



## యువతకు చట్టాలపై అవగాహన కల్పించాలి

- చట్టాలపై యువతకు అవగాహన కల్పించండి
- నీతివంతమైన సమాజాన్ని నిర్మిద్దాం
- రంగారెడ్డి కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

అవినీతి రహిత సమాజం కోసం యువతకు చట్టాలపై అవగాహన కల్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ పౌండర్ రాజేంద్ర పల్నాటి, జాతీయ కార్యవర్గసభ్యుడు చెరుకూరి జంగయ్య గురువారం జిల్లా కలెక్టర్ ను కలిశారు. మంచి సమాజం కోసం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ గత పదిహేను సంవత్సరాలుగా ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేస్తూ, నీతివంతమైన సమాజం కోసం కృషి చేయడం అభినందనీయం అన్నారు. కళాశాలలో, పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు అవినీతిని ప్రశ్నించేలా యువతకు చట్టాలపై అవగాహనతో పాటు, నిజాయితీగా పనిచేసినా అధికారులు, నాయకుల గురించి వివరించాలన్నారు. నిజాయితీపరులను స్ఫూర్తిగా తీసుకొని మంచి విలువలు గల యువతరం తయారవుతుందన్నారు. అనంతరం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ బ్రోచర్ విడుదల చేశారు.

## యువత క్రీడల్లో రాణించాలి



**పినపాక, విశాలభారతి:**


యువత క్రీడల్లో రాణించాలని ఏడూళ్ళ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ సూచించారు. పినపాక మండల పరిధిలోని తిర్లాపురం గ్రామాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. మారుమూల గ్రామాల్లో యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. యువత విద్య, వైద్య, రాజకీయ రంగాలలో రాలించాలని ఆయన అన్నారు. పోలీస్ శాఖ సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. యువత అసాంఘిక చర్యలకు దూరంగా ఉండాలని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరంజ్ ఆస్పత్రి వైద్యుల దారుణం

- చికిత్స పొందుతూ యువకుడు మృతి
- ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన

**ఎల్బీనగర్, విశాలభారతి :**





ఎల్బీనగర్ లోని ఆరంజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. కుటుం బ సభ్యులు, బంధువుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కేంద్రం.. 9వ వార్డు నడ్డివారి గూడెంకు చెందిన జెర్రిపోతుల భాస్కర్ పెద్ద కుమారుడు అఖిల్(18). వరంగల్లో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. సోమవారం నాగా ర్జునసాగర్ వద్ద జరిగిన ఒక యాక్సిడెంట్లో తీవ్రంగా గాయపడడంతో ఎల్బీనగర్లోని ఆరం జ్ ఆస్పత్రికి తరలించారు. తొడ భాగంలో బోన్ ఫ్రాక్చర్ కావడంతో మంగళవారం సర్జరీ చేశా రు. ఆపరేషన్ విజయవంతం అయిందని కూడా డాక్టర్స్ చెప్పారు. కానీ ఆపరేషన్ అయిన గంటల వ్యవ ధిలోనే యువకుడు తనకు గుండె వద్ద నొప్పి వస్తుంది అని చెప్పినా.. కార్డియాలజిస్ట్ డాక్టర్లు డ్యూటీలో లేరని నిర్లక్ష్యం చేశారు. బుధవారం ఉదయం యువకుడి గుండె నుంచి రక్తం సరఫరా కావడం లేదని, గుండె పోటుతో చని పోయాడని ప్రకటించారు. ఆస్పత్రి యాజమా న్యంపై చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. ఎల్బీనగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ఆస్పత్రి వద్దకు చేరుకొని బాధితులను సముదాయించారు.



## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నూతన కమిటీ ఎన్నిక

**ఎల్బీనగర్ ,విశాలభారతి:**

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం బుధవారం జాతీయ కార్యాలయంలో ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వేముల పుష్పలత గౌడ్ , రాష్ట్ర కార్యదర్శిగా కమ్మరి గౌరీ, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి గా రయిసా బేగం, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా కొండబోయిన అనిత, రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా ఈనపల్లి ఉపేంద్ర ను నియమించారు. ఈ సందర్భంగా ఎంపికైన వారికి నియామకపు పత్రాలను ఆయన అందజేశారు. అనంతరం డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదన్నారు. ఈ చట్టాన్ని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, ప్రాణహాని ఉన్నప్పుడు 48గంటలలో సమాచారాన్ని అధికారులు ఇవ్వాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బటయకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపీనాథ్ కట్టెకోల, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్, కె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.



## జ్ఞానాన్ని పెంచుకోవడం ఐచ్ఛికం కాదు, అవసరం

- జాతీయ కార్యశాల ప్రారంభోత్సవంలో స్పష్టీకరించిన హెచ్.సీ.యూ ప్రొఫెసర్ ఉద్గాట

**పటాన్ చెరు,విశాలభారతి:**

జ్ఞానం నిరంతరం అభివృద్ధి చెందుతోందని, ఈ పరిణామ వేగం సంవత్సరాల నుంచి కేవలం రోజులకు చేరుకుందని, అందువల్ల మనని మనం నవీకరించుకోవడం ఇకపై ఐచ్ఛికం కాదు, అవసరం అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సిబా ఉద్గాట స్పష్టీకరించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, హైదరాబాదులోని గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'పెద్ద భాషా నమూనాలు, ఉత్పాదక కృత్రిమ మేధస్సు' (LLMs and Generative AI) అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యశాల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో లాంఛనంగా ప్రారంభించిన డాక్టర్ ఉద్గాట మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు, సాంకేతికతలో వేగవంతమైన పురోగతి గురించి తెలుసుకోవాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. మౌలిక అంశాలపై పట్టు సాధించడం తప్పనిసరి అయినప్పటికీ, పురోగతికి నిరంతర అభ్యాసం, విచారించే తత్త్వం అవసరమన్నారు. ఆవిష్కరణలకు కీలకం ప్రశ్నించడంలో ఉంది, ఏదైనా ఎందుకు పనిచేస్తుందో, ప్రత్యామ్నాయాలు ఎందుకు ఉన్నాయో అర్థం చేసుకోవడం అవశ్యమని డాక్టర్ ఉద్గాట వ్యాఖ్యానించారు. ప్రారంభోత్సవంలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ మౌనేంద్ర శంకర్ దేశర్కర్ మాట్లాడుతూ, గీతం ఇటువంటి ప్రభావవంతమైన వర్క్ షాపులను నిరంతరం నిర్వహిస్తున్నందుకు ప్రశంసించారు. ఇందులో పాల్గొంటున్న వారు కృత్రిమ మేధస్సుపై జరిగే పరిశోధన, ప్రయోగాలలో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. 'ఇది సంక్లిష్టమైన, అభివృద్ధి చెందుతున్న రంగం. కృత్రిమ మేధస్సు మానవ ఆలోచన ప్రక్రియలను ఎలా అనుకరిస్తుందో అన్వేషించడం ద్వారా, గణనీయమైన మెరుగుదల, పురోగతిని సాధించగలం. ఈ భావనలను నిజంగా అర్థం చేసుకోవడానికి ఆచరణాత్మక అనుభవం కీలకం' అని ఆయన పేర్కొన్నారు. కార్యశాల నిర్వాహకులు డాక్టర్ మోతాహర్ రెజా, ప్రొఫెసర్ బీ.ఎం. నాయుడు, గౌరవనీయ అతిథులను సాదరంగా స్వాగతించగా, సమన్వకర్తలు డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, డాక్టర్ కె.కృష్ణ వందన సమర్పణ చేశారు. ఈ కార్యశాల నిపుణుల నేతృత్వంలో చర్చలు, ఆచరణాత్మక సెషన్ లు, సహకార అభ్యాసాలతో శుక్రవారం వరకు కొనసాగనుంది.

## మనది మంగళవారం.. మందిది సోమవారమా కేసీఆర్?

**కోదాడ, విశాలభారతి:**



ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై మాట్లాడుతున్న కేసీఆర్, కేటీఆర్ లు మనది మంగళవారం.. మందిది సోమవారం అన్నట్లు వ్యవహరిస్తున్నారని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వర రావు ఘాటు విమర్శలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపుల పైన కేసీఆర్, కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. టీడీపీ ఎమ్మెల్యే తలసానిని మంత్రిగా చేసినప్పుడు కేసీఆర్ ను కేటీఆర్ ఎందుకు నిలదీయ లేదని, గతంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలను టిఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నప్పుడు కేటీఆర్ కు ఈ వాస్తవాలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కెసిఆర్, కేటీఆర్ లు చెప్పాలన్నారు. అధికార మదంతో ప్రతిపక్ష హోదా సైతం లేకుండా అప్పటి శాసనసభా పక్ష నేత భట్టి విక్రమార్కకు అన్యాయం చేయడం ఎవరూ మర్చిపోలేదని గుర్తు చేశారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్న కేసీఆర్ కనీసం శాసనసభలో దళితున్ని శాసనసభ పక్షనేతగా కూడా చూడలేక పోయారని ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయింపులపై నేడు వేదాలు వల్లిస్తుండడం హాస్యాస్పదమని అన్నారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని అన్నారు. ప్రతి పక్షం ఒక బాధ్యతాయుతంగా ఉంటేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అలాంటి ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసే విధంగా కేసీఆర్, కేటీఆర్ లు గతంలో వ్యవహరించిన తీరును అందరూ గుర్తు చేసుకోవాలని అన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వదించిన మాజీ మంత్రి

**దేవరుప్పల, విశాలభారతి:**



పెద్ద తండా గ్రామానికి చెందిన గుగులోత్ రాందాన్ కూతురు,పోచంపల్లి జయరామ్ తండాకు చెందిన బానోత్ రాజన్న కుమారుడి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.వారి వెంట జిల్లా బిఆర్ఎస్ నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,మాజీ ఎంపిపి కొల్లూరి సోమన్న,యువజన నాయకుడు కోతి ప్రవీణ్,మండల నాయకులు తదితరులున్నారు.



## సమ్మక్క సారక్క వనదేవతల ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ కలగజేయాలి

- ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం చిరుమళ్ళ గ్రామంలో చందా వంశస్థులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మక్క సారక్క వనదేవతల జాతరకు గురువారం తెలంగాణ రాష్ట్ర మంత్రి మంత్రివర్యులు దనసరి అనసూయ( సీతక్క)పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విచ్చేసి సమ్మక్క సారక్క గద్దెలను దర్శించుకున్నారు. అనంతరం ఆదివాసి గిరిజనులతో నృత్యం చేసిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ చిరుమళ్ళ గ్రామంలో సమ్మక్క సారక్క జాతరకు రావడం చాలా సంతోషకరం అని ఈ సమ్మక్క సారక్క గుడిని రానున్న రోజుల్లో అభివృద్ధి చేస్తామని గుడికి కావలసిన రోడ్ మరియు చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి కృషి చేస్తామని ఎంతో ఘనంగా సమ్మక్క సారక్క జాతర నిర్వహిస్తున్న చందా వంశస్తులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. సమ్మక్క సారక్క వనదేవతల ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ కలగజేయాలని కోరుకున్నామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, చందా సంతోష్ , కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, యువజన నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





## బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డికి మద్దతుగా శిల్పారెడ్డి ప్రచారం

**పటాన్ చెరు,విశాలభారతి:**

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బిజెపి అభ్యర్థి సి.అంజిరెడ్డికి మద్దతుగా బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి ప్రచారం నిర్వహించారు. గురువారం పటన్ చెరువ నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని విద్యుత్ నగర్ లో పట్టభద్రుల ఓటర్ల ఇంటికి వెళ్లి శిల్పారెడ్డి ప్రచారం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ చిన్న మైల్ అంజి రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఎన్నికల్లో అంజిరెడ్డికి పట్టభద్రులు అదరూ మద్దతుగా నిలిచి గెలిపించాలని శిల్పారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు రాంబాబు గౌడ్. పటాన్ చెరు నియోజకవర్గ ప్రబారి ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షులు కౌన్సిలర్ రాజు, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి. ప్రవీణ్ కుమార్, అనిల్ కుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి, బూత్ అధ్యక్షులు జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



## cinema updates



## `స్వయంభూ` పాన్ ఇండియా రిలీజ్

`కార్తికేయ2` తో నిఖిల్ పాన్ ఇండియా మార్కెట్ లోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. ఉత్తరాదిన `కార్తికేయ2 `కనెక్ట్ అవ్వడంతో భారీ వసూళ్లు సాధించింది. దీంతో నిఖిల్ పాన్ ఇండియా స్టార్ గా అవతరించాడు. అయితే ఆ తర్వాత చేసిన చిత్రాలేవి కనెక్ట్ అవ్వలేదు. అవన్నీ రీజనల్ గానే రిలీజ్ అయ్యాయి. కానీ `స్వయంభూ` ప్రకటనతో ఒక్కసారిగా నిఖిల్ వైపు అందర్నీ తిప్పకున్నాడు. ఇది చోళ సామ్రాజ్యానికి సంబంధించిన కథ కావడంతో ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని పాన్ ఇండియాలో తెరకెక్కిస్తున్నారు.ఈ సినిమా కోసం నిఖిల్ కత్తియుద్ధం , గుర్రపుస్వారీ పై ప్రత్యేకంగా శిక్షణ తీసుకుని మరీ రంగంలోకి దిగాడు. ఏడాది కాలంగా షూటింగ్ చేస్తూనే ఉన్నారు. తాజాగా చిత్రీకరణ మొత్తం పూర్తయినట్లు తెలుస్తోంది. చిన్నపాటి ప్యాచ్ వర్క్ లు మినహా షూట్ పూర్తయిందని సమాచారం. అయితే ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఎక్కువ సమయం తీసుకుంటుంది. విజువల్ గా హైలైట్ అవ్వాల్సిన సినిమా కావడంతో సీజీ వర్క్ ఎక్కువగా ఉంది.భారీ వార్ సన్నివేశాలున్నాయి. అందుకోసం విదేశీ టెక్నాలజీని వాడుతున్నారు. ఈ నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ మొత్తం పూర్తవ్వడానికే రెండు నెలలుకు పైగా సమయం పడుతుందని సమాచారం. అన్ని పనులు పూర్తి చేసి జూన్ లో సినిమాని రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారుట. అంటే ఇంకా మూడు నెలలకు పైగా సమయం ఉంది. ఈ లోగా ప్యాచ్ వర్క్ తో పాటు, పోస్ట్ ప్రొడక్షన్ పూర్తవ్వాలి. అటుపై సెన్సార్ ముందుకెళ్లాలి.అక్కడ అభ్యంతరాలు ఏమైనా వ్యక్తం అయితే? మళ్లీ ఎడిట్ చేయాల్సి ఉంటుంది. మరి ఇవన్నీ ముగించుకుని జూన్ కల్లా ప్రేక్షకుల ముందుకొస్తారా? రారా ? అన్నది చూడాలి. ఇప్పటికే ఈసినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ అదరగొడుతుంది. ఓవర్సీస్ రైట్స్ భారీ మొత్తానికి అమ్ముడు పోయినట్లు తెలుస్తోంది. `కార్తికేయ 2` సక్సెస్ నేపథ్యంలో స్వయంభు కు ఇంత డిమాండ్ ఏర్పడింది.



## తండేల్ టార్గెట్ ఫినిష్..

నాగ చైతన్య కెరీర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా సరైన హిట్ లేకపోవడం, వరుసగా ఫ్లాప్‌లతో కాస్త వెనుకబడటం అభిమానులకు నిరాశ కలిగించింది. 'థాంక్ యూ', 'కస్టడీ' సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో చైతూ కెరీర్ గురించి పెద్ద చర్చే నడిచింది. అయితే, ఇప్పుడు 'తండేల్' మూవీతో ఫ్యాన్స్ కు మంచి కిక్ ఇచ్చాడు. వరుస ఫ్లాప్స్ ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. ఈసారి, రియల్ స్టోరీతో కూడిన యాక్షన్ డ్రామా కావడంతో అంచనాలు బాగా పెరిగాయి. ఇక బాక్సాఫీస్ వద్ద అనుకున్నట్లే టార్గెట్ ను కూడా తొందరగానే ఫినిష్ చేశాడు.చందూ మొండేటి తెరకెక్కించిన విధానం, నాగ చైతన్య - సాయి పల్లవి కెమిస్ట్రీ సినిమాకి ప్లస్ అయ్యాయి. సినిమా మొదటి రోజే అద్భుతమైన వసూళ్లు సాధించి, నాగ చైతన్య కెరీర్‌లో బెస్ట్ ఓపెనింగ్స్ నమోదు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమా చాలా బలంగా ఆడుతోంది. నాగ చైతన్యకు ఇదివరకూ యూఎస్ మార్కెట్‌లో ఒక స్థిరమైన ఫాలోయింగ్ ఉన్నా, ఇటీవలి సినిమాలతో ఆ మార్కెట్ తగ్గిపోయింది. గతంలో 'మజిలీ' తో కెరీర్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ అందుకున్న చైతు ఆ తరువాత లవ్ స్టోరీతో కూడా సాలీడ్ కలెక్షన్స్ రాబట్టాడు. ఇక ఇప్పుడు 'తండేల్'తో అదే మ్యాజిక్ రిపీట్ చేసింది. ముఖ్యంగా నాగ చైతన్య నెవర్ బిఫోర్ లుక్, హై ఇమోషనల్ కంటెంట్, యాక్షన్ సీక్వెన్స్ సినిమాకు బాగా హెల్ప్ అయ్యాయి. ఈ సినిమా సక్సెస్‌తో నాగ చైతన్య మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడనే చెప్పొచ్చు. తండేల్ బడ్జెట్ పరంగా కూడా నాగచైతన్య కెరీర్ లో చాలా పెద్ద సినిమా. ఇక విడుదలకు ముందే సినిమాకు నాన్ థియేట్రికల్ బిజినెస్ ద్వారా మంచి బిజినెస్ జరిగింది. ఇక ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద పెట్టిన పెట్టుబడి వచ్చేసింది. దీంతో నిర్మాత సేఫ్ కావడమే కాకుండా లాభాలు అందుకున్నాడు అని చెప్పవచ్చు.

## కృతి శెట్టి వాలెంటైన్ వైబ్స్..



క్యూట్ హీరోయిన్ కృతి శెట్టి, 'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లో సాలీడ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. తొలి సినిమాతోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన కృతి తన లుక్స్‌తో యూత్‌లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ను సంపాదించుకుంది. ఆ తర్వాత బంగార్రాజు, శ్యామ్ సింగరాయ్, ది వారియర్ వంటి చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల మరింత దగ్గరైంది. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కృతి, తెలుగుతో పాటు తమిళ చిత్రాలపై కూడా దృష్టి పెట్టింది. అయితే, వరుసగా వచ్చిన 'మాచర్ల నియోజకవర్గం, ది వారియర్, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, కస్టడీ వంటి సినిమాలు బాక్సాఫీస్ వద్ద అంతగా రాణించకపోవడం ఆమెకు కాస్త నిరాశని కలిగించింది. సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న కృతి, ఇలాంటి స్లో ఫేజ్‌లో కూడా సోషల్ మీడియాలో తన స్టైలిష్ ఫోటోషూట్స్‌తో హవా చూపిస్తుంది. ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రెండింగ్‌లో నిలుస్తుంది. తాజాగా కృతి వాలెంటైన్స్ డే స్పెషల్‌గా వైట్ ఫ్లోరల్ గౌన్‌లో ఫోటోషూట్ చేసి ఇన్‌స్టాలో షేర్ చేసింది. ఈ స్టిల్స్‌లో ఆమె గ్లామర్ టచ్‌తో క్యూట్ లుక్స్ కనబరిచింది. పచ్చని పువ్వుల బొకే పట్టుకుని, స్వీట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ ఫోజులిచ్చింది. ముఖ్యంగా ఆమె చిరునవ్వు, సింపుల్ మెకప్ తో నేచురల్ లుక్‌లో కనిపించి ఫ్యాన్స్‌ను ఫిదా చేసింది. "వాలెంటైన్స్ డే లేదా గాలెంటైన్స్ డే – మీరు ఏది సెలబ్రేట్ చేస్తున్నారు?" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్‌కి ఫ్యాన్స్ నుంచి రిప్లైలు వెల్లువలా వచ్చాయి. కృతి సినిమాల్లో ప్రస్తుతం కాస్త స్లోగానే ఉన్నా, సౌత్‌లో కొన్ని ప్రాజెక్ట్స్ లో చర్చలు జరుగుతున్నాయి. తమిళంలో ఒక బిగ్ హీరోతో నటించే అవకాశం ఉందని టాక్.

## రానాకు కండిషన్




టాలీవుడ్ హీరోల్లో రానా దగ్గుబాటి మల్టీ టాలెంటెడ్ హీరో అని చెప్పొచ్చు. ఓ వైపు హీరోగా, మరోవైపు హోస్ట్ గా, నిర్మాతగా, ప్రెజెంటర్ గా అన్నీ రంగాల్లో దూసుకెళ్తున్నాడు. రానా హీరోగా సినిమా వచ్చి చాలా రోజులైంది. అలా అని అతనేమీ ఆడియన్స్ కు దూరంగా లేడు. ఈ గ్యాప్ లో తను పలు సినిమాలకు సమర్పకుడిగా, నిర్మాతగా వ్యవహరిస్తూ బిజీ అయ్యాడు. రీసెంట్ గా ప్రైమ్ వీడియోలో ది రానా దగ్గుబాటి అనే టాక్ షోను కూడా స్టార్ట్ చేసి సక్సెస్‌ఫుల్ గా రన్ చేస్తున్నాడు. అయితే ప్రెజెంటర్ గా ఆల్రెడీ సక్సెస్ అయిన రానా కు ఓ కండిషన్ పెట్టాడట స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ. సిద్ధూ జొన్నలగడ్డతో రానా ఓ సినిమాను ప్లాన్ చేశాడట. సిద్ధూ ఆ సినిమాను చేయాలంటే రానా కు తానొక కండిషన్ పెట్టాడని స్వయంగా రానానే చెప్పాడు. కోవిడ్ టైమ్ లో సిద్దు జొన్నలగడ్డ హీరోగా వచ్చిన కృష్ణ అండ్ హిజ్ లీలా సినిమాను రీరిలీజ్ చేస్తేనే తనతో సినిమాకు ఒప్పకుంటానని కండిషన్ పెట్టాడని, వాస్తవానికి ఇది రీరిలీజ్ కాదని, మొదటిసారి ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కాబోతుందని రానా చెప్పకొచ్చాడు. సిద్ధూ, శ్రద్ధా శ్రీనాథ్, సీరత్ కపూర్ నటించిన ఈ సినిమా కరోనా టైమ్ లో రిలీజై చాలా మందిని ఆకట్టుకుంది. ఈ సినిమా ద్వారానే సిద్ధూ ఆడియన్స్ కు బాగా దగ్గరయ్యాడు. అయితే కరోనా టైమ్ అవడంతో ఈ సినిమా థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలోకి వచ్చేసింది. ఇప్పడా సినిమాను వాలెంటైన్స్ డే కానుకగా థియేటర్లలో రిలీజ్ కాబోతుంది. కాకపోతే టైటిల్ ను మాత్రం ఇట్స్ కాంప్లికేటెడ్ అని పేరు మార్చారు. ఆడియన్స్ ఈ సినిమాను థియేటర్లలో చూశాక ఎలా రియాక్ట్ అవుతారో చూడాలని ఉందని సిద్ధూ తెలిపాడు. సినిమా మొదటిసారి థియేటర్లలో రిలీజవుతున్న సందర్భంగా హీరో సిద్ధు, డైరెక్టర్ రవికాంత్ పేరేపుతో పాటూ రానా కూడా రంగంలోకి దిగి సినిమాను ప్రమోట్ చేస్తున్నారు. ఈ సినిమాను థియేటర్లలో చూడాలని ఓటీటీలో రిలీజైన టైమ్ లో చాలా మంది భావించారని, వారి కోసమే ఇప్పుడు సినిమాను రిలీజ్ చేస్తున్నట్టు సిద్దు తెలిపాడు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.